
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
5
మంగళవారం 18 మార్చి 2025



రాజీవ్ వికాసంతో యువతకు బాసట



- రూ. 3 లక్షల వరకు ఆర్థిక సహాయం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా అమలు
- జిల్లాలో 16,800 మందికి లబ్ధి
- ఏప్రిల్ 5వరకు దరఖాస్తుల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తున్నది. స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకొని తమ కాళ్లపై తాము నిలబడి తమ ఆర్థికస్థితి గతులను మెరుగుపరుచుకునేందుకు యువతకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఈ పథకం అమలు చేయనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 4,200 మందికి ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందించనున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 16,800 మంది యువతీ,యువకులకు ఈ పథకం కింద లబ్ధిచేకూరనున్నది. హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో అంతర్భాగమై ఉన్న చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు ఆ నియోజకవర్గ కోటా కింద వెయ్యి నుంచి 1200 మందికి ఆర్థిక సహాయం అందే అవకాశమున్నది. దీనితో జిల్లాలోని 18 వేల మంది యువతీయువకులు స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పుకోవడానికి త్వరలోనే ఆర్థిక సహాయం లభించనున్నది.

• దరఖాస్తు చేసుకునేందుకు అర్హతలు:

- తెలంగాణకు చెందిన స్థిరనివాసి అయి ఉండాలి.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గానికి చెందిన వారు అయి ఉండాలి.
- నిరుద్యోగ యువతీ యువకులకు మాత్రమే అవకాశం ఉంటుంది.
- ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతాల వివరాల సమర్పించాలి.
- రేషన్‌కార్డు, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలో నమోదు అయి ఉండాలి.

• ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం అమలులో భాగంగా మార్చి 17న దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది. ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆర్థిక సహాయం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీయువకులు చేస్తున్న దరఖాస్తులను ఏప్రిల్ 6 నుంచి మే 31వరకు పరిశీలించి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలని నిర్ణయించారు.

• మూడు కేటగిరీల్లో ఆర్థిక సహాయం

కేటగిరీ-1, 2,3 వారిగా ఆర్థిక సహాయం అందించనున్నారు. కేటగిరీ-1 కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తారు. ఇందులో 80 శాతం సబ్సిడీగా ప్రభుత్వం సమకూర్చుతుంది. 20 శాతం నగదును లబ్ధిదారులు సమకూర్చుకోవలసి ఉంటుంది. కేటగిరీ-2 కింద లక్ష నుంచి రెండు లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తారు. ఇందులో 70 శాతం సబ్సిడీగా ఇస్తారు. మిగతా 30 శాతం లబ్ధిదారులు సమకూర్చుకోవాలి. కేటగిరీ-3 కింద 2 నుంచి 3 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తారు. ఇందులో 60 శాతం ప్రభు త్వమే సబ్సిడీగా సమకూర్చనుండగా లబ్ధిదారులు 40శాతం భరించాల్సి ఉంటుంది. కేటగిరీ-1 కింద

(మిగతా 8వ పేజీలో)

ఫటాఫట్ గంజాయి నియంత్రణకు చర్యలు

• జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు



జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, వినియోగం, అమ్మకాలు ఇటీవల ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. యువతను మత్తుకు బానిసలుగా మార్చుతున్న నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు ఎక్సైజ్ శాఖ తీసుకుంటున్న చర్యలపై జిల్లా ఎక్సైజ్ సూపరిటెండెంట్(ఇఎస్) పి శ్రీనివాసరావుతో 'ఆంధ్రజ్యోతి' ఫటా ఫట్

ఆంధ్రజ్యోతి: గంజాయి నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈఎస్: జిల్లాలో గంజాయిసాగు లేదు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు (ఏవోబీ) నుంచి ఇక్కడికి రవాణా అవుతున్నట్లు గతంలో మేము పట్టుకున్న నిందితులు విచారణలో వెల్లడించారు.. అలవాటుపడిన స్థానికులకు ఇతర ప్రాంతాల నుంచి కొన్ని ముఠాలు రహస్యంగా గంజాయిని తీసుకువచ్చి సరఫరా చేస్తున్నారు. గంజాయి నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా బస్టాండ్, రైల్వేస్టేషన్, అనుమానిత ప్రాంతాల్లో నిత్యం విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. పోలీసుశాఖ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ 'డ్రగ్స్‌ఫ్రీ' జిల్లాగా చేసేందుకు కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి నష్టాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నారా?

ఈఎస్: యువత, విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో కాన్షియస్ నెస్‌క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ఈ క్లబ్‌లలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు, ఎక్సైజ్, ఇతర అధికారులుంటారు. ఈ క్లబ్ సభ్యులు విద్యార్థుల ప్రవర్తన, నడవడికను ఎప్పటికప్పుడు గమనిస్తూ మత్తు పదార్థాల బారినపడకుండా చర్యలు తీసుకుంటుంటారు. మరోవైపున విద్యార్థులు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా మత్తుపదార్థాలతో జరిగే నష్టాలను తెలియజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పాత నేరస్థులు గంజాయి చేయకుండా ఎలాంటి చర్యలు చేపట్టారు?

ఈఎస్: పాత నేరస్థులపై నిఘాపెడుతున్నాం. వారు మళ్లీ గంజాయి అమ్మకాలను చేపట్టకుండా స్థానిక తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తున్నాం. పాత నేరస్థులు మళ్లీ గంజాయి కేసులో చిక్కితే రెండు లక్షల రూపాయల వరకు జరిమానా విధించే అవకాశముంది.

-కరీంనగర్ క్రైం (ఆంధ్రజ్యోతి)

వ్యవసాయంలో కృత్రిమ మేధ
• పంటల్లో చీడపీడల నివారణకు రైతులకు సలహాలు
7

రంజాన్‌కు విస్తృత ఏర్పాట్లు
• రూ.18.19 లక్షలకు ఈద్గాల వద్ద సౌకర్యం
8

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

సుభాష్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ప్రాధాన్యం ఇచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయప్రయాసకోర్చి వస్తారని, అధికారులు వారి దరఖాస్తులపై సానుకూలంగా వ్యవహరించడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజావాణికి మొత్తం 253 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, హుజురాబాద్ ఆర్డీవో రమేశ్ పాల్గొన్నారు.

'స్వచ్ఛసర్వేక్షణ్'లో అగ్రస్థానంలో నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహించే దేశవ్యాప్త స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో కరీంనగర్ నగరపాలక సంస్థను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా స్వయం సహాయక సంఘాల సభ్యులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, శానిటేషన్ జవాన్లతో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలు డివిజన్లలో ప్రతి ఇంటిని సందర్శించి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్ ద్వారా స్మార్ట్ ఫోన్‌లో నగరవాసులతో ఫీడ్‌బ్యాక్ తీసుకుని తడి, పొడిచెత్త వేర్వేరు సేకరణ ప్రక్రియపై అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛ ఆటోల్లో చెత్త వేరు చేసి డీఆర్‌సీసీ సెంటర్, ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. వీలైనంత వరకు డంపుయార్డుకు చెత్త వెల్లకుండా చూడాలన్నారు. మంగళవారం నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీ ప్రారంభమవుతున్నందున నిబంధనల మేరకు కార్యక్రమాలను నిర్వహించాలని, దీనిపై జవాన్లు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. నగరంలో రోడ్లను ప్రతిరోజూ శుభ్రం చేయాలని, లిట్టర్ బిన్స్, డంపర్ బిన్స్ ఏర్పాటు చేసిన చోట పరిశుభ్రతను పాటించాలని అన్నారు. కమర్షియల్ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం రోడ్లను శుభ్రం చేయాలని, ఎక్కడ అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని జవాన్లను ఆదేశించారు. మూడు నెలల పాటు స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే కొనసాగుతుందని తెలిపారు. ఈనెల 21న ఏర్పాటు చేసిన బల్క్ వేస్ట్ ఎక్స్‌పో సమావేశంలో హోటల్స్, రెస్టారెంట్స్ నిర్వహకులు పాల్గొనేలా చూడాలని అన్నారు. నగర ప్రజలు నగర స్వచ్ఛతకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి పాల్గొన్నారు.

ఇల్లందకుంట ఆలయ కమిటీకి మోక్షమెప్పుడో?

- 2018లో ముగిసిన కమిటీ
- ఆరేళ్లుగా అధికారుల పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు

ఇల్లందకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీని ఎప్పుడు నియమిస్తారోనని భక్తులు ఎదురుచూస్తున్నారు. 2018లో పాలకవర్గ కమిటీ చైర్మన్‌గా ఎక్కటి సంజీవరెడ్డి పని చేశారు. 2019లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కమిటీ ప్రకటించలేదు. 2020-21లో రెనోవేషన్ కమిటీ చైర్మన్‌గా ఎక్కటి మధుసూదన్‌రెడ్డిని ప్రకటించారు. కొవిడ్ వల్ల బ్రహ్మోత్సవాలు నిరాడంబరంగా ఆలయ ప్రాంగణంలో జరిపించారు. 2022లో ఉత్సవ కమిటీని ప్రకటించారు. ఆ ఆర్డర్ కాపీ బయటకు రాకుండానే రద్దు అయింది. 2019 నుంచి 2024 వరకు అధికారుల పర్యవేక్షణలోనే బ్రహ్మోత్సవాలు నిర్వహించారు.



ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయ ముఖద్వారం

• ప్రతి ఏటా రూ. కోటి ఆదాయం...

ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయం దేవాదా య ధర్మదాయ శాఖ ఆధీనంలో 'ఎ' గ్రేడ్‌లో ఉంది. ఈ ఆల యానికి ప్రతిఏటా కోటి రూపాయల ఆదాయం సమకూరు తుంది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు 13 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలను తిలకించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

• వచ్చే 4 నుంచి బ్రహ్మోత్సవాలు

ఏప్రిల్ 4వ తేదీ నుంచి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దేవాలయ కమిటీ లేకపోవడంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈవో సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆలయానికి రంగులు వేయడం ప్రారంభించారు. ఏప్రిల్ 4నుంచి 16వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఈవో సుధాకర్ తెలిపారు. ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ నియామకానికి దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆశావహులు ఇప్పటికే మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌ను కలవడం జరిగింది. ప్రణవ్ ఇటీవల ఆలయ కమిటీ ఏర్పా టు చేయాలని మంత్రి కొండ సురేఖను కలిసి వినతిపత్రం అంద జేశారు. ఆలయ అభివృద్ధి కమిటీలో ఎవరికి చోటు దక్కుతుందోనని ఆశావాహులు ఎదురు చూస్తున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉంటుంది కాబట్టి త్వరగా ఆలయ కమిటీని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



తిమ్మాపూర్‌లోని ఎంజేపి పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

తిమ్మాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించించాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ కచ్చితంగా పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సోమవారం రాత్రి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లో వసతులను, సౌకర్యాలను పరిశీలించారు. వంట గదిని, సరుకుల స్టోరేజీ గదిని తనిఖీ చేశారు. సరుకులను వాటి బ్రాండ్, నాణ్యత, గడువు తేదీని పరిశీలించారు. వంట గదిలో శుభ్రత పాటించాలని, నాణ్యంగా భోజనం తయారు చేయాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. నిర్ధేశించిన కంపెనీలకు చెందిన స్టాక్‌ను మాత్రమే వినియోగించాలన్నారు. అనంతరం బాలికలతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 621 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-1 పరీక్షలకు 621మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సోమవారం నిర్వహించిన ఈపరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగంలో కలిపి 19,425 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా జనరల్ విభాగంలో 453 మంది, వొకేషనల్‌లో 168 మంది మొత్తం 621 మంది పరీక్షలకు హాజరుకాలేదు. జనరల్ విభాగంలో 17,167 మంది, వొకేషనల్‌లో 1,617 మంది, మొత్తం 18,804 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 30 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారని, ఎక్కడ కూడా కాపీయింగ్ జరుగలేదని జిల్లా పరీక్షల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

కుష్టు వ్యాధి గుర్తింపునకు ఇంటింటి సర్వే

భగత్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటిలో సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 30 వరకు కుష్టు గుర్తింపు ఉద్యమంలో పాల్గొనాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రికార్డులను తనిఖీ చేశారు. ఫార్మసీ స్టోర్స్‌లో మందుల నిల్వలను పరిశీలించారు. కార్యక్ర మంలో జిల్లా అదనపు వైద్యాధికారి (లెప్రసీ అండ్ ఎయిడ్స్) డాక్టర్ సుధ, పీవో ఎంసీహెచ్ డాక్టర్ సనా జవేరియా, లెప్రసీ న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిక్కత్, డాక్టర్ నజియా, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ లింగారెడ్డి, ప్రకాశ్. డీపీవో స్వామి పాల్గొన్నారు.

ఉల్లంపల్లి బీటీ రోడ్డుకు ఇంకెన్నాళ్లు?

- 30 సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నగ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఉల్లంపల్లి నుంచి సుందరగిరికి వెళ్లే రోడ్డు

చిగురుమాడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఉల్లంపల్లి గ్రామం బీటీ రోడ్డుకు నోచుకో వడం లేదు. 30 యేళ్లుగా మట్టిరోడ్డుపై ప్రయా ణిస్తూ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభు త్వం హయాంలో 26 జూన్ 2023న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదేరోజు మండలంలోని ఇతర గ్రామాల్లోనూ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో చేప ట్టిన పనులు పూర్తయ్యాయి. ఉల్లంపల్లిలో మాత్రం ప నులు చేపట్ట లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శంకుస్థాపన చేసిన కొద్దిరోజులకు ఉల్లంపల్లి గ్రామం నుంచి సుందరగిరి వరకు రోడ్డ వెడల్పు, చెట్ల తొలగింపు, కల్వర్టుల నిర్మించారు. తర్వాత వదిలేశారు. ఈ రోడ్డు కోసం గ్రామప్రజలు రాజకీయాలకు అతీతంగా ఆందోళనలు నిర్వహిం చారు. ఎన్నికల్లో గ్రామానికి ప్రచారానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ను గ్రామ స్థులు అడ్డుకున్నారు. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయింది. దీంతో ఆయన యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులకు 2.25 కోట్ల నిధులను మంజూరు చేయించారు. పనులు ప్రారంభించి, కొద్దిపాటి పనులు చేసి అర్ధాంతరంగా నిలిపివేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని రోడ్డు పనులు ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొద్ది పాటి పనులు చేసి నిలిపివేశారు..

- పోలోజు వేంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్, ఉల్లంపల్లి



బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సీఆర్ఆర్ నుంచి 2.25 కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులకు 2023లో శంకుస్థాపన చేశారు. కల్వర్టులు, చెట్ల తొలగింపు, రోడ్డు వెడల్పు లాంటి పనులు చేపట్టారు. బీటీ వేయడం మరిచారు. ఇదే విషయంపై అనేకసార్లు సంబంధితశాఖ అధికారులను అడిగితే తమ చేతుల్లో ఏమీ లేదంటున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రత్యేకదృష్టి సారించి మా గ్రామానికి బీటీ రోడ్డు వేయించి ఇబ్బందులను తొలగించాలి.

జలగంటకు వేళాయె..




వెల్గటూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే భానుడు ప్రతాపం చూపుతుండడంతో ఎండలు మండుతున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం చొరవ తీసుకొని పాఠశాలల్లో మళ్లీ జల గంట అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కరోనా కంటే ముందు 2018లో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ గంటకు ఒకసారి జలగంట మోగించాలని నిర్ణయించింది. ప్రతీ పాఠశాలల్లో జలగంట అమలు చేయడంతో పిల్లల శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్త పడ్డారు. కానీ కరోనా తరువాత జలగంట విషయం మరిచి పోయారు. దీనితో వేసవి కాలం వచ్చిందంటే విద్యార్థులు డీ హైడ్రేషన్‌కు గురైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

పిల్లల్లో నీటి శాతం తగ్గితే ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని, సాధ్యమైనంత వరకు తగిన మోతాదులో పిల్లలకు నీటిని అందించాలని వైద్యులు పేర్కొంటున్నారు. కొంత మంది బాల బాలికలు నీరు తాగితే మూత్రం వస్తుందనే భయంతో ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న నీటిని కూడా తాగడం లేదని తెలుస్తోంది. కొన్ని పాఠశాలల్లో మూత్రశాలలు సరిగా లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

పాషిగామ పాఠశాలలో అమలు

జలగంట ప్రాముఖ్యతను గుర్తించిన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాషిగామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్ కుమార్ పాఠశాలలో అమలు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతీ గంటకు ఒకసారి చిన్నారులు నీటిని తాగేలా ఒక కాల పట్టికను తయారు చేసి గోడపై ప్రదర్శించారు. ఆ సమయం ప్రకారం విద్యా ర్థులు నీటిని తాగేలా చర్యలు చేపట్టారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకొని విద్యార్థులు గంటకు ఒకసారి నీరు తాగేలా చర్యలు చేపడితే వారి ఆరోగ్యాన్ని కాపాడిన వారవుతారు.

- వేసవిలో నీరు ఎక్కువగా తాగాలని నిపుణుల సూచన
- గతంలో పాఠశాలల్లో అమలు
- కరోనా తర్వాత ఆచరణకు నోచుకోని వైనం
- విద్యార్థుల్లో నీరు తగ్గితే ప్రమాదమని వైద్యుల హెచ్చరిక



పాషిగామ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమయ పట్టిక

జలగంట అమలు చేస్తే మేలు..

విద్యార్థులు తగినంత నీటిని తాగకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. బడి ఈడు పిల్లలు వారి వయసు, లింగం, బరువును బట్టి ప్రతీ రోజు ఒక లీటరు నుంచి 2.5 లీటర్ల వరకు నీటిని తాగాలని వైద్యులు పేర్కొంటున్నారు. శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంలో, ఎలక్ట్రో లైట్లను సమతుల్యం చేయడంలో నీరు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. తగిన మోతాదులో ప్రతి నిత్యం నీటిని తాగడం వలన మెదడు పని తీరు కూడా బాగుంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. అన్ని విద్యా సంస్థల్లో జలగంట అమలు చేస్తే విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా, వడ దెబ్బకు గురి కాకుండా నివారించవచ్చు. రోజంతా కూర్చొని చదవడం కంటే కనీసం గంటకు ఒక సారి ఐదు నిమిషాలు నీటిని తాగడానికి కేటాయిస్తే బాగుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. విద్యార్థుల్లో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో జలగంట మోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీరు తాగడం అలవాటుగా మారాలి

డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల



ప్రతీ ఒక్కరు రోజూ తగినంత నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా బడి ఈడు పిల్లలు నీటిని తాగడంలో అశ్రద్ధ వహిస్తారు. దీనితో వేసవి కాలం డీ హైడ్రేషన్ వలన చర్మం పొడిబారడం, వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. వారి వారి వయసు, బరువును బట్టి ఒకటి నుంచి 2.5 లీటర్ల వరకు నీటిని అందిం చేలా చూడాలి. పాఠశాలల్లో విద్యార్థులకు తగి నంత నీటిని అదించేలా చర్యలు చేపట్టాలి.

జల గంట అమలు చేస్తున్నాం

నీలం సంపత్ కుమార్, పాషిగామ స్కూల్ హెచ్ఎం



పాషిగామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ప్రతీ గంటకు ఒకసారి నీటిని తాగేలా జల గంట అమలు చేస్తున్నాం. ఒక కాల పట్టికను ఏర్పాటు చేసి ఆ సమయం ప్రకారం విద్యార్థులు నీరు తాగేలా చర్యలు చేపట్టాం. అన్ని పాఠశాలల్లో జలగంట అమలు చేస్తే విద్యార్థుల ఆరోగ్యం కాపాడినట్లు అవుతుంది.

ప్రతి గంటకు నీరు తాగుతున్నాం

భవిష్య వర్శ, పాషిగామ పాఠశాల విద్యార్థిని



మా పాఠశాలలో ప్రతి గంటకు ఒకసారి జలగంట మోగిస్తారు. ఉపాధ్యాయులు కచ్చితంగా ప్రతి గంటకు నీరు తాగాలని మాకు సూచిస్తున్నారు. దీంతో అందరం విద్యార్థులం నీటిని తాగుతున్నాం.

ఏటీఎం కార్డ్ మార్చి రూ.40 వేలు చోరీ

జమ్మికుంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి బ్యాంక్ ఖాతా నుంచి అపరిచిత వ్యక్తి రూ.40వేలు విత్‌డ్రా చేశాడు. వివరాల్లోకి వెళితే.. జమ్మికుంట పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్‌ఉద్యోగి సోమవారం ఉదయం ఎస్‌బీఐ ఏటీఎంకు డబ్బుల కోసం వెళ్లాడు. అప్పటికే ఓ అపరిచిత వ్యక్తి సదరు రిటైర్డ్ ఉద్యోగిని అనుసరిస్తున్నాడు. మొదట రిటైర్డ్ ఉద్యోగి ఏటీఎం మిషన్‌లో కార్డు పెట్టగా టెక్నికల్ ఎర్రర్ అని వచ్చింది. దీంతో వెనుకాల ఉన్న అపరిచిత వ్యక్తి తాను చూస్తానని ఏటీఎం కార్డు తీసుకున్నాడు. ఉద్యో గికార్డు తనదగ్గర పెట్టుకుని తన దగ్గర ఉన్న కార్డును మిషన్‌లో పెట్టాడు. సిక్రెట్ పిన్‌నంబరు ఎంటర్ చేయాలని ఉద్యోగికి సూచించాడు. పిన్ ఎంటర్ చేయగా రాంగ్‌పిన్ అని వచ్చింది. దీంతో అతను తర్వాత తీసుకుంటానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత అపరిచిత వ్యక్తి తనదగ్గర ఉన్న రిటైర్డ్ ఉద్యోగి ఏటీఎంకార్డు పెట్టి అప్పటికే తెలుసుకున్న పిన్ నంబరు ఎంటర్‌చేసి రూ.10వేల చొప్పున నాలుగుసార్లు రూ.40వేల కాజేశాడు. సెల్‌ఫోన్‌కు డబ్బులు కట్ అవుతున్నట్లు మేసేజ్ రావడంతో సదరుఉద్యోగి వెంటనే బ్యాంకుకు వెళ్లి ఏటీఎం కార్డు బ్లాక్ చేయించాడు. అనంతరం పోలీస్‌లను ఆశ్రయించినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్లాపూర్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామ శివారులో ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని గోసెల రాజ్‌కుమార్(28) అనే యువకుడు సోమవారం మృతిచెందాడు. మెట్‌పల్లిసీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణానికి చెందిన రాజ్‌కుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం మల్లాపూర్ మండలం రాఘవపేటలో బంధువుల ఇంట్లో శుభకార్యంలో పాల్గొన్నాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ముత్యంపేట గ్రామ శివారులో చెట్టుకు వేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించగా సోమవారం మృతిచెందాడు. మృతుడితండ్రి గోసెల రమేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు సీఐతెలిపారు. కాగా రాజ్‌కుమార్‌కు 18నెలల క్రితం వివాహం జరిగింది.

లారీ ఢీ కొని మహిళ మృతి

తిమ్మాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామంలో రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొంది. ఈ సంఘటనలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నేదునూర్ గ్రామానికి లచ్చవ్వ(52) నల్లగొండ గ్రామంలో జరుగుతున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం ఆటోలో బయలుదేరింది. ఈ క్రమంలో రేణికుంట గ్రామం వద్ద ఆటోను ఆపి కొబ్బరికాయలను కొనేందుకు రోడ్డుకు అవతలివైపునకు వెళ్లింది. కొబ్బరికాయలు కొనుగోలు చేసిన లచ్చవ్వ ఆటో ఎక్కేందుకు వెళుతూ రోడ్డుదాటుతోంది. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదారాబాద్‌వైపు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చిన లారీ లచ్చవ్వను ఢీకొంది. ఈ సంఘటనలో లచ్చవ్వ అక్కడికక్కడే మృతిచెందింది. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

లారీ, బైక్ ఢీ: యువకుడి మృతి

అంతర్గాం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుందనపల్లి శివారు రాజీవ్ రహదారిపై లారీ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో సోమవారం బైక్‌పై వెళ్తున్న బండి ప్రసాద్ అనే సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. పెద్దంపేట గ్రామానికి చెందిన బండి ప్రసాద్(32) ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 11ఇంక్లైన్‌లో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై బీ పవర్‌హౌజ్ గడ్డ మీదుగా కుందనపల్లి ఐఓసీఎల్ ఏరియా వైపు వెళ్తుండగా ఎన్‌టీపీసీ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ వెంకటస్వామి శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం శవాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెప్టిక్‌ట్యాంక్‌లో పడి ఒకరి మృతి

రాయికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో రాయికల్ పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన సిలివేరి కిరణ్ కుమార్ (54) ఇంట్లో నిర్మాణంలో ఉన్న సెప్టిక్‌ట్యాంక్‌లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణం


రాజగంగు (ఫైల్)

కథలాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాలకు చెందిన కాసారపు రాజగంగు (50) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం ఎదిగిన కొడుకు ఎలాంటి పని చేయకపోవడంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి బుచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


అనసూర్య (ఫైల్)

కోరుట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని తాండ్ర్యాల ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద కొద్దిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనసూర్య(55) అనేమహిళ సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం ఈనెల 1న కథలాపూర్ మండలం అంబారిపేటకు చెందిన తోట సంధ్య, ఆమె అత్త అనసూర్య బ్యాంక్‌లో పని ముగించుకుని ఇంటికి వెళ్ళేందుకు బస్సు కోసం వేచి చూస్తున్నారు. వీరిని బైక్‌తో వేములకుర్తి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న లంక నరేశ్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో అత్తా, కోడళ్లకు తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనసూర్య మృతి చెందిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంచంద్రం తెలిపారు.

చోరీ అయిన ట్యాబ్‌ల రికవరీ

మానకొండూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 14న రాత్రి 23ట్యాబ్‌లు దొంగతనానికి గురయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చోరీ కేసును చేధించారు. సీఐ లక్ష్మీనారాయణ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి పది రోజుల క్రితం ప్రార్థన సమయంలో హెచ్ఎం చూపించిన ట్యాబ్‌లను దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. కాగా సదరు విద్యార్థి ఇంటికి వెళ్తున్నానని చెప్పి అదే రోజు రాత్రి 23 ట్యాబ్‌లను దొంగిలించి మండలంలోని కొండపల్కల గ్రామంలోని రాముని గుట్టపై దాచిపెట్టాడు. ట్యాబ్‌లను రికవరీ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. 24గంటల్లో కేసు చేధించడంపై సీపీ గౌస్ ఆలం, ఏసీపీ శుభం ప్రకాశ్ సీఐని అభినందించారు.


రికవరీ చేసిన ట్యాబ్‌లతో పోలీసులు

వీధి కుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన రాచర్ల అంజయ్యకు చెందిన గొర్రెల మందపై వీధి కుక్కలు సోమవారం ఉదయం దాడిచేయడంతో 16గొర్రెలు మృతిచెందగా మరో 8 గాయపడ్డాయి. దీంతో మూడులక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. మండల పశు వైద్యాధికారి మనీషాపటేల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించాలని కోరాడు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ కాంతయ్య, పంచాయతీ కారోబార్ భూమేశ్వర్ పాల్గొన్నారు.


మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి మనీషాపటేల్

సోషల్ మీడియాలో అశ్లీల పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అశ్లీల పోస్టు పెట్టిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని త్రీటౌన్ పరిధిలోని ఒక వ్యక్తి ఇన్‌స్టాగ్రాంలో అశ్లీల పోస్టు పెట్టాడు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రన్ సైబర్ టిప్‌లైన్ ద్వారా త్రీటౌన్ పోలీసులకు రిపోర్టు వచ్చింది. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రూ.3లక్షల ఆస్తి నష్టం

మల్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రానికి చెందిన సట్ట లత అనే మహిళ ఇంట్లో సోమవారం తెల్లవారు జామున షార్ట్‌సర్క్యూట్‌తో రూ.3లక్షల నష్టం జరిగింది. ఇంట్లోని బంగారు నగలు, నగదుతో పాటు ఇతర వస్తువులు దగ్ధం అయ్యాయి. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో బాధితులు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్స్ పోలీసులు మధుసూధన్‌రెడ్డి, సంపత్ సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే ఇంట్లో గల ఫర్నిచర్, రెండు తులాల బంగారు నగలు కాలిపోయాయి.

ఆర్టీసీ బస్సులో నుంచి కిందపడిన విద్యార్థిని

శంకరపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీబస్సులో నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థిని కిందపడిన సంఘటన శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కనకం మేఘన సోమవారం కరీంనగర్‌లో పరీక్షకు హాజరై తిరిగి బస్సులో ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో ముత్తారం గ్రామంలోని మూలమలుపువద్దకు రాగానే డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో బస్సులోనుంచి ఆమె కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోఉన్న ప్యాసింజర్లను వేరేబస్సులో పంపంచి అదేబస్సులో మేఘనను చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ శివారులో రెండు బైకులు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన దండు కొంరయ్య మొలంగూర్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొలంగూర్ పెట్రోల్ బంక్ ఎదురుగా డేనియల్ అనే వ్యక్తి దండు కొంరయ్య బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. అదే సమయంలో కరీంనగర్ నుంచి వర్ధన్నపేటకు వెళ్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ప్రమాదస్థలం వద్ద తన వాహనాన్ని ఆపి గాయపడిన వారిని పరామర్శించి, డానియల్‌ను తనవాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించగా, కొంరయ్యను 108లోతరలించారు.

ఆటోను ఢీకొట్టిన ద్విచక్రవాహనం: ఇద్దరికి గాయాలు

తంగళ్లపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలకేంద్రంలో ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువతులు గాయపడ్డారు. సిద్దిపేటజిల్లాకు చెందిన నీహారిక, రుచిత ద్విచక్రవాహనంపై వస్తూ తంగళ్లపల్లిలో ఆటోనుఢీకొట్టారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. ఈ సంఘనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో విద్యార్థినికి గాయాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కుక్క కాటుతో విద్యార్థిని గాయపడింది. వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామానికి చెందిన గొట్టిముక్కల దేవరాజు, కృపారాణి దంపతుల కూతురు సువర్ణ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతోంది.

సోమవారం సాయంత్రం బహిర్భూమి కోసం పాఠశాల గది నుంచి బయటకు వచ్చి వెళ్లే సమయంలో అప్పటికే గురుకుల పాఠశాలలో ఉన్న కుక్కల గుంపు విద్యార్థినిపై దాడిచేసి గాయపరుస్తుండగా సువర్ణ అరుపులు విన్న విద్యార్థులు అక్కడికి చేరుకుని కుక్కలను చెదరగొట్టారు. కుక్కల దాడితో గాయపడ్డ సువర్ణను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించి కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి చేరుకున్న తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులు, వాచ్‌మన్ నిర్లక్ష్యంవల్లే కుక్కలు పాఠశాలలోకి వచ్చి దాడి చేశాయని దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుక్కలదాడిలో గాయపడ్డ సువర్ణను ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పెండం ఆదిత్య, బీఎస్పీ వీర్నపల్లి మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

నత్తనడకన వాటర్ ట్యాంక్ పనులు



నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు, కొనుగోలు చేసి పక్కన పడవేసిన పైపులు

- అమృత్ పథకం కింద నిధులు మంజూరు
- గత ఏడాది ఆగస్టు 7న శంకుస్థాపన
- పిల్లర్ల దశలోనే పనులు
- ఈ యేడాదీ తప్పని తాగునీటి కష్టాలు

సుల్తానాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అమృత్ 0.2 పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.18.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు భావించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఇబ్బందులను తొలగించేందుకు తొమ్మిది నెలల క్రితం నిర్మాణం చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పట్టణ ప్రజలకు వేసవిలో ఈ ట్యాంక్ ద్వారా మెరుగైన నీటి సరఫరా అయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుల్తానాబాద్, సుగ్లాంపల్లి, శ్రీరాములపల్లి, శాస్త్రీనగర్, పూసాల గ్రామాలు ఉన్నాయి. ఆయా విలీన గ్రామాలలో అప్పటి గ్రామ పంచాయతీకి సంబంధించిన మంచినీటి పథకాలు ఉన్నాయి. వీటితోపాటు మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లాలు బిగించి సరఫరా చేస్తున్నారు. సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు ఇటు మిషన్ భగీరథ పథకం నీళ్లుగానీ అటు మానేరు నీరు కానీ పూర్తి స్థాయిలో అందడం లేదు

రెండు రోజులకోసారి సరఫరా

సుల్తానాబాద్ పట్టణంలో ప్రస్తుతం రెండు రోజులకోసారి (డే బై డే) నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పాత కాలం నాటి పైపులైన్ల కారణంగా తరుచూ పైపులైన్లు దెబ్బతింటున్నాయి. సుల్తానాబాద్ పట్టణానికి తాగునీటి సరఫరా వ్యవస్థ ఉన్న గట్టేపల్లి మానేరులోని బావిలో పని చేస్తున్న మోటార్లు తరుచు కాలిపోతున్నాయి. ఈ కారణాలతో నీటి సరఫరాలలో తీవ్ర ఇబ్బందులు ఎదురువుతున్నాయి. డే బై డే కూడా నీరు రాని దుస్థితి ఎదురవుతుంది. కాలిపోయిన మోటార్లు, ధ్వంసమైన పైపులైన్ల మరమ్మతు చేయించడంలో ఆలస్యం అవుతున్నందున తాగునీటి సరఫరా ఇబ్బందికరంగా మారింది.

తొమ్మిది నెలల క్రితం శంకుస్థాపన

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.18.40కోట్ల నిధులతో 14 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను గతేడాది ఆగస్టు 7న ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. నిర్మాణ పనులు ఆలస్యంగా ప్రారంభించారు. ట్యాంక్ పనులు పిల్లర్ల స్థాయిలో మాత్రమే ఉన్నాయి. పనులు వేగవంతం చేసి ట్యాంక్‌ను ఈ వేసవిలో ఉందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. రోజూ నీటి సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్యాంక్ పనులు అభివృద్ధిలో ఉన్నాయి

నియాజ్ మున్సిపల్ కమిషనర్



అమృత్ స్కీం ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు అభివృద్ధిలో ఉన్నాయి. వేసవికి ట్యాంక్ అందు బాటులోకి రాకపోవచ్చు. అయినా పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంలో ఎలాంటి ఆటంకం లేకుండా చూ స్తున్నాం. అప్పుడప్పుడు పైప్‌లైన్ల మరమ్మతు వచ్చినా వెంటనే పూర్తి చేయిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు సక్రమంగా నీటి సరఫరా చేస్తున్నాం. ప్రత్యేక పైప్‌లైన్ల కోసం కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. అవి టెండర్ల దశలో ఉన్నాయి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు కేసులో ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ చెక్కు కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాలప్రకారం.. రెండునెలల క్రితం 40మందిలబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు వచ్చాయి. ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయం నుంచి వినయ్ అనేవ్యక్తిద్వారా చెక్కు పంపించారు. రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన అంతగిరి శ్రీనివాస్ అనేవ్యక్తి రవి అనేలబ్ధిదారుని పేరుమీదవచ్చిన రూ.60 వేల చెక్కును వినయ్ దగ్గర నుంచి తీసుకున్నాడు. ఇదేగ్రామానికి చెందిన రవి అనే వ్యక్తినికలిసి అతని అకౌంట్‌లో వేశాడు. తమకు సంబంధించిన చెక్కు కాకపోయినప్పటికీ ఇద్దరు కలిసి డబ్బులు పంచుకున్నారు. విషయం వెలుగులోకి రావడంతో ఎమ్మెల్యేక్యాంపు ఆఫీస్ పీఏ డోలిసాయికృష్ణ ఫిర్యాదు మేరకు డబ్బులను స్వాధీనం చేసుకొని సోమవారం వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరికి జైలు

జగిత్యాలక్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరికి రెండు నెలల చొప్పున జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పెల్లి పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన పీట్ల సూరి, కొమిరి నరేష్ ఓబాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు లైంగికంగా వేధించారు. దీంతో బాలిక కుటుంబసభ్యులు 2020లో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో సూరి, నరేష్‌కు జైలు శిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్‌లను ఎస్పీ అభినందించారు.

చేనేత పవర్‌లూం రంగానికి రూ. 2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

డిప్యూటీ సీఎంకు సీఐటీయూ నాయకుల వినతి



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చేనేత పవర్‌లూం రంగానికి రూ. 2 వేల కోట్లను కేటాయించి వాటిపై అధారపడి పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూషం రమేష్, కూరపాటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడం రమణ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికు మార్‌లు కోరారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీలో సోమవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పవర్‌లూం పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభం వల్ల రాష్ట్రంలో 15 నెలల కాలంలో సరైన ఉపాధి లేక దాదాపు 30 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సిరిసిల్లలో మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పనలో భాగంగా ఇప్పటికే షెడ్‌లు పూర్తయిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తిచేసి కార్మికులకు అందించాలని కోరారు. మరమగ్గాల కార్మికులకు 2023 సంవత్సరంలో తయారు చేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీ డబ్బులు రూ.9 కోట్లు కార్మికులకు అందించాలని కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వం తయారు చేయిస్తున్న పొదుపు సంఘాల మహిళలకు అందించే చీరల తయారీలో కార్మికులకు రోజుకు రూ. వెయ్యి వచ్చే విధంగా కూలీ నిర్ణయించాలని కోరారు. సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమలకు సంబంధించి సెస్ సంస్థ విధించిన బ్యాక్ బిల్లింగ్ అదనపు విద్యుత్ చార్జీలు రూ. 30 కోట్లను రద్దు చేయాలని కుటీర పరిశ్రమ అసాములకు 10 హెచ్‌పీ వరకు ఉచిత విద్యుత్ అందించాలని అదేవిధంగా టెక్స్‌టైల్ పార్కులో విద్యుత్ భారంగా మూతపడ్డ పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలుచేపట్టడంతో పాటు 50 శాతం విద్యుత్ రాయితీ అందించి అన్ని రకాల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.



వ్యవసాయంలో కృత్రిమ మేధ

- పంటల్లోచీడపీడల నివారణకు రైతులకు సలహాలు
- మొబైల్ యాప్‌ను రూపొందించిన ఐకార్

చొప్పదండి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలోకి ఏఐ టెక్నాలజీ వచ్చేసింది. మారుమూల ప్రాంతాల్లోని రైతులతో శాస్త్రవేత్తలను అనుసంధానం చేస్తు ఏఐ ఆదారిత యాప్ అందుబాటులోకి వచ్చింది. సాగులో వివిధ రకాల తెగుళ్ల, చీడపీడలు పంటలకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయి. సాంప్రదాయకంగా ఈ ప్రమాదాలను నియంత్రించడానికి రైతులు విచ్చలవిడిగా రసాయనిక పురుగుమందులు ఉపయోగిస్తారు. విపరీతంగా పురుగు మందుల వాడకం వల్ల నష్టాలు ఉన్నాయి. జల, వాయు, భూ కాలుష్యం, పర్యావరణ అసమతుల్యం, జంతువుల్లో, పక్షుల్లో, మనుషుల్లో కలిగే అనారోగ్యాలు, చీడల్లో పురుగు మందుల నిరోధకత పెరుగుతుంది. చీడపీడలు, సమగ్ర పురుగు మందుల వాడకం గురించి రైతులకు సరైన సమాచారం లేకపోవడం వల్ల సస్య రక్షణ సమాచారం కోసం పురుగు మందుల డీలర్లపై ఆధారపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ, ఐకార్ (భారత వ్యవసాయ పరిశోదన సంస్థ) నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్‌ఎస్) అనే ఏఐ ఆధారిత మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను రూపొందించారు. ఆగస్టు 15, 2024న ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ యాప్‌ను ఆవిష్కరించగా గత డిసెంబరులో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. రైతుల పొలాల్లో చీడ పీడలను త్వరగా గుర్తించి వాటి నివారణకు సత్వర సలహాలు, సూచనలు అందించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వ భారత వ్యవసాయ శాఖ పరిధిలోని మొక్కల సంరక్షణ తనిఖీ, ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సహకారంతో ఈ నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం (ఎన్‌పీఎస్‌ఎస్) ఏఐ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.

డౌన్‌లోడ్ ఇలా

ఆండ్రాయిడ్, ఐవోఎస్ ప్లే స్టోర్ ద్వారా ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రైతులు పంట పొలంలో వాడడానికి వీలుగా ఈ యాప్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పనిచేస్తుంది. యాప్ ప్రస్తుతం ఆంగ్లం, హిందీ, మరాఠి భాషల్లో అందుబాటులో ఉంది. ప్రస్తుతం యాప్‌లోని కొన్ని ఫీచర్లు రైతులు, అందుబాటులో ఉన్నాయి. చీడపీడలు, తెగుళ్ల గుర్తింపు, ప్రధాన పంటలకు సంబంధించిన కీటక వ్యాధులను సకాలంలో ఎదుర్కొనేందుకు రైతులు సరైన సలహాలు పొందవచ్చు.

చీడపీడల గుర్తింపు మాడ్యూల్...

ప్రస్తుతం తెగుళ్ల గుర్తింపు మాడ్యూల్ 61 ముఖ్యమైన పంటలకు సంబంధించిన వివిధ చీడపీడలు, తెగుళ్లను గుర్తించగలదు. ఈ మాడ్యూల్‌లో రైతులు నేరుగా మొబైల్ కెమెరా నుంచి ఫొటోను క్యాప్చర్ చేయవచ్చు లేదా ఫోన్ గ్యాలరీ నుంచి అప్‌లోడ్ చేయవచ్చు. ఏఐ ఆధారిత వ్యవస్థ అప్‌లోడ్ చేసిన ఫోటోలను విశ్లేషించి అందుబాటులో ఉన్న డేటాబేస్‌ను ఉపయోగించి తెగులును గుర్తించి, ఆ తెగులు వల్ల కలిగే లక్షణాలపై సమాచారాన్ని అందిస్తుంది. సమర్థవంతమైన తెగులు, చీడపీడల నియంత్రణ కోసం ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం) పద్ధతులను ఇది సూచిస్తుంది.

మొబైల్ యాప్ విశేషాలు

ఎన్‌పీఎస్‌ఎస్ ఏఐ ఆధారిత మొబైల్ యాప్ ద్వారా రైతులకు పంటల్లో చీడపీడల యాజమాన్యంపై పూర్తి సమాచారాన్ని శాస్త్రవేత్తలు రైతులకు అందిస్తారు. ఈ యాప్‌లో పురుగుల ఫొటోలను, పంట ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. యాప్ చీడపీడలను, తెగుళ్లను గుర్తిస్తుంది. వెంటనే పిచికారి చేయాల్సిన మందుల వివరాలు, సూచనలు యాప్‌లో కనిపిస్తాయి.

15 రకాల పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న, మిరప, గోధుమ, యాపిల్, అరటి, వంగ, ద్రాక్ష, కంది, మినుము, దానిమ్మ, సోయాబీన్, చెరకు, టమాట పంటల్లో పురు గులు, తెగుళ్ల ఉధృతి సమాచారం రైతులు తెలుసుకోవచ్చు. పంటల్లో పురుగుల ఉధృతికి తగ్గట్టుగా చీడపీడల నివారణ చర్యలను ఈ యాప్ సిఫారసు చేస్తుంది.

ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్ యాప్ ద్వారా ఏ వ్యాధి, ఏ కీటకం హానికరం లేదా ప్రయోజనకరమైనది అని తెలుసుకోవచ్చు. దాని క్రిమిసంహారక మందులను, ఏ పరిమా ణంలో, ఏ సమయంలో, ఎంత వాడాలి అనే సమాచారాన్ని పొందవచ్చు. క్రిమిసంహారక మందుల కంటే ముందుగా సమగ్ర సస్య రక్షణ యాజమాన్య పద్ధతుల వాడకాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ మొబైల్ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, ఉద్యాన పంటల్లోని పురుగులు, తెగుళ్ల సమగ్ర సమాచారం అందుతుంది.



యాప్ లోగో

ఇంటి వద్దకు భద్రాద్రి రాముడి తలంబ్రాలు



కార్గో సిబ్బంది వద్ద భద్రాచలం తలంబ్రాల కోసం బుక్ చేసుకుంటున్న ఆర్ఎం రాజు

భగత్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రాముడి తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ఇంటి వద్దకే చేర్చనున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు తెలిపారు. సోమవారం కార్గో సిబ్బంది వద్ద భద్రాద్రి రాముడి తలంబ్రాల కోసం బుక్ చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీన భద్రాచలంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణం సందర్భంగా అక్కడకు వెళ్ల లేని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో తలంబ్రాలను ఇంటి వద్దకు పంపించే ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకు ఒక్కో ప్యాకెట్‌కు 151 రూపాయలు ఆన్ లైన్‌లో లేదా బస్టాండ్ కార్గో సెంటర్లు, ఏజెంట్ కౌంటర్ల వద్ద బుక్ చేసుకోవచ్చన్నారు.

తలంబ్రాల బుకింగ్ కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

కరీంనగర్ ఆర్ఎంఈ	9154298581
కరీంనగర్	9154298562
గోదావరిఖని	9154298554
హుస్నాబాద్	9154298673
హుజూరాబాద్	9154298559
మంథని	9154298554
జగిత్యాల	7780250439
కోరుట్ల	9154298572
మెట్‌పల్లి	9154298574
సిరిసిల్ల	9154298576
వేములవాడ	9154298574



కల్యాణంలో త్రిశూలాలను చూపుతున్న శివపార్వతులు



కల్యాణం.. కమనీయం

- వేములవాడలో శివపార్వతుల కల్యాణం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం సతీమణి మంజుల
- తలాంబ్రాలు పోసుకున్న జోగినులు

వేములవాడ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాత మామిడి కింద కట్నాలు రాయంగా.. పూత మామిడి కింద పుస్తెలు కట్టంగా.. తల్లిమామిడి కింద తలువాలు పోయంగ.. అష్టాణ కంకణం, నొష్టాన బాసింగంతో.. పక్కన పార్వతి, నెత్తిన గంగమ్మ, రెక్కల శూలాలతో పెద్దలందరూ తరలివచ్చి వేములవాడ పార్వతిరాజరాజేశ్వర స్వామి వారి దివ్య కల్యాణం వైభవో పేతంగా, కన్నుల పండువగా నిర్వహించారు. రాజన్న ఆలయ ప్రధాన అర్చకుడు నమిలికొండ ఉమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక పూజలతో పాటు ధ్వజారోహణ ఘనంగా నిర్వహించారు. వరుడు రాజరాజేశ్వర స్వామి, వధువు పార్వతీ దేవి అమ్మవారిని రాజన్న ఆలయం నుంచి మేళతాళాలతో ఆలయ గెస్ట్‌వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వరుడు శ్రీరాజరాజేశ్వర స్వామి వారి తరుపున పెళ్లి పెద్దగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, వధువు శ్రీపార్వతిదేవి అమ్మవారి తరుపున ఆలయ అర్చకులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. శివుడికి వరకట్నంగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రూ. 551 కోట్లు చెల్లిస్తామని అన్నారు. కన్యాదాతలుగా ఈశ్వరగారి సురేష్- నాగలక్ష్మీ దంపతులు వ్యవహరించగా వేదపండితులు అభిజిత్‌లగ్న మూహర్తమున ఉదయం 10.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు వేద మంత్రోచ్చరణలతో అత్యంత వైభవో పేతంగా శ్రీస్వామి వారి దివ్యకల్యాణ తంతు జరిపించారు.

60 వేలకు పైగా తరలివచ్చిన భక్తజనం

ఆది దంపతుల దివ్య కల్యాణమహోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం రాత్రి భక్తులు వేములవాడకు తరలవచ్చి ఆలయ వసతి గదులతో పాటుగా ఆలయ పరిసరాల్లోని ఖాళీస్థలాల్లో విడిది చేశారు. తెల్లవారు జామునే శ్రీస్వామి వారి కల్యాణం తిలకించేందుకు ఆలయానికి తరలిరావడంతో ఆలయ ఆవరణ, ప్రాంగాణం ఓం నమఃశివాయ స్మరణతో మారుమోగిపోయింది. రాజన్న ఆలయ ప్రధాన ద్వారం ముందు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పట్టణ పురవీధులు భక్తులతో కిక్కిరిసి పోయాయి. సుమారుగా 60 వేలకు పైగా భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు.

రాజన్నను మనువాడిన జోగినులు

దక్షిణకాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజన్న కల్యాణం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి జోగినులు రాజన్న ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి కల్యాణానికి వచ్చిన ట్రాన్స్‌జెండర్లు, జోగినీలు, శివపార్వతులు తోటి వారికి పుస్తెలు కట్టి తలంబ్రాలు పోసుకుంటూ సాక్షాత్తు పరమ శివుడిని మనువాడినట్లు స్మరించుకున్నారు. సుమారు 50 వేలకు పైగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. ఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, టౌన్ సీఐ వీరప్రసాద్ భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు.

ధర్మారం: ధర్మారం మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం స్వామి కల్యాణాన్ని నిర్వ హించారు. పెళ్లి పెద్దలుగా ఒడ్నాల శంకరయ్య-సుగుణ, దాసి రవీందర్-జయశ్రీ దంపతులు కల్యాణం జరిపించారు.



తలంబ్రాలు పోసుకుంటున్న జోగినిలు

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులోని వేములవాడ అనుబంధ దత్తత ఆలయమైన స్వయంభు నాగ లింగేశ్వర స్వామి ఆల యంలో సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.



మొక్కులు చెల్లించుకుటున్న భక్తురాలు



పార్వతిపరమేశ్వరులకు తలంబ్రాలు పోస్తున్న కన్యాదాతలు

పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రముఖులు

కల్యాణానికి రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, రాజన్న ఆలయం తరపున ఈవో వినోద్‌రెడ్డి, వేములవాడ మున్సిపల్ తరపున కమిషనర్ అన్వేష్‌లు పట్టు వస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ కార్యలయం నుంచి కమిషనర్‌తో పాటు ఉద్యోగులు డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా రాజన్న ఆలయం వరకు తరలివచ్చారు. బీజేపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పట్టువస్త్రాలు తలంబ్రాలు తీసుకువచ్చి రూ. 11వేల 121 కట్నంగా చదివించారు.



స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి పొన్నం సతీమణి మంజుల, భక్తులకు అన్నదానం, ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో వినోద్‌రెడ్డి

వైభవంగా స్వామి వారి పెద్ద సేవ



నెమలివాహనంపై స్వామి వారల ఊరేగింపు

వేములవాడ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో పెద్ద సేవ ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వ హించారు. కల్యాణం అనంతరం రాత్రి 7 గంటల సమయం లో శ్రీస్వామి వారలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలోని జంగమయ్యలు ఆది దంపతుల కల్యాణాన్ని పురష్కరించుకుని వీర భద్రుడి పాటలు పాడుతూ శరభ గజ్జల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నెమలి వాహనంపై ఉత్సవమూర్తులు కొలువుదీరిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ కంబల వెంకటన్న ఉన్నారు.

లక్ష్మీ నృసింహుడి దిగ్యాత్ర



స్వామివారల ఊరేగింపు

ధర్మపురి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ నృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను పురవీధుల గుండా ఉత్తర దిగ్యాత్ర కోసం ఉసిరిక వాగు వద్దకు తీసుకువెళ్లి పూజలు చేశారు. రాత్రి స్వామి వారల సేవలు తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణయ్య, నరసింహమూర్తి, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఆదాయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి రూ.2,96,630 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.1,23,014, ప్రసాదాలు విక్రయించగా రూ.1,42,400 లభించాయి. అన్నదానం కోసం భక్తులు సమర్పించిన విరాళాలు రూ.31,216 ఉన్నట్లు ఆయన వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారల దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి 8 గంటలకు దోపోత్సవం (దోపుకథ) ఉంటుంది. శేషప్ప కళావేదికపై మధ్యాహ్నం తెలంగాణ సాంస్కృతిక సారథులచే జానపద, భక్తి, సంగీతం, నృత్యాలు, గడ్డం రమేష్‌చే భక్తి సంగీతం, రాత్రి 7 గంటల నుంచి కరీంనగర్‌కు చెందిన శశికళ బృందంచే భక్తి సంగీతం ఉంటుంది. అనంతరం ఆలయ అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్‌చే దోపుకథ ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

రెండో రోజు కొనసాగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

సెమిఫైనల్స్‌కు చేరుకున్న కరీంనగర్, మెదక్, హైదరాబాద్, నిజామాబాద్ జట్లు

హుజూరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలు సోమవారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్‌రావు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. కరీంనగర్ వర్సెస్ మెదక్, హైదరాబాద్ వర్సెస్ నిజామాబాద్ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం 7గంటలకు సెమీ ఫైనల్స్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రెటరీ సర్దార్ సురేందర్‌సింగ్, బి శ్రీనివాస్, తోట రాజేంద్రప్రసాద్, సీనియర్ క్రీడాకారులు పవన్‌కుమార్, శ్రీనివాస్, శంకర్, వెంకటేశ్వర్లు, సురేష్, తిరుపతి, రవికుమార్, శ్యాంసుందర్, సజ్జు, సాయికృష్ణ, రాజేష్, విక్రమ్, సాంబ, కరీంనగర్ జిల్లా జట్టు కోచ్ రాజేష్, మేనేజర్ వినయ్ పాల్గొన్నారు.

- **మ్యాచ్‌ల వివరాలు..**

రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ గ్రూప్-ఏలో ఖమ్మంపై వరంగల్ 9-1, రంగారెడ్డిపై హైదరాబాద్ 4-3, వరంగల్‌పై కరీంనగర్ 1-0, ఖమ్మంపై రంగారెడ్డి 1-0విజయం సాధించాయి. గ్రూప్-బీలో నల్గొండపై మహబూబ్‌నగర్ 16-2, ఆదిలాబాద్‌పై నిజామాబాద్ 2-0, మెదక్‌పై మహబూబ్‌నగర్ 3-1, నల్గొండపై నిజామాబాద్ 12-2, ఆదిలాబాద్‌పై మెదక్ తలపడగా చెరొక రెండు గోల్స్ వేసి డ్రాగా ముగిసింది.

రైతులకు చేరువలో విద్యుత్ సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమేశ్‌బాబు

గణేశ్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసినట్లు, వ్యవసాయానికి సంబంధించి ఎస్టిమేట్, మెటీరియల్ వివరాలు తెలుగులో అందిస్తున్నట్లు నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్, కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేశ్‌బాబు తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు వ్యవసాయ ఎస్టిమేట్ కాపీలుతెలుగులో అందజేయనున్నామని, దీంతో సులభంగా అర్థం అవుతాయని అన్నారు. ఎస్ఎంఎస్ కూడా తెలుగులోనే పంపి స్తున్నామన్నారు. ఏజెన్సీ వారే పనులు పూర్తి చేస్తారన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందులో భాగంగా విద్యుత్ అధికారుల పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఒరిగిన స్తంభాలు, వదులు తీగలను సరిదిద్దుతున్నట్లు చెప్పారు. మోటార్లకు కెపాసి టర్లు పెట్టుకోవాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు. కెపాసిటర్లలో మోటార్లు మరి ఎంత కాలం మన్నికగా ఉంటా యన్నారు. రైతులకు ఎటు వంటి ఇబ్బందులు తలెత్తినా 1912 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

రంజాన్‌కు విస్తృత ఏర్పాట్లు

- రూ.18.19 లక్షలతో ఈద్గాల వద్ద సౌకర్యాల కల్పన

కరీంనగర్ టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న రంజాన్ పండుగ సందర్భంగా నగరపాలక సంస్థ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు 18.19 లక్షల రూపాయలతో ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేసేందుకు టెండర్లను నిర్వహించారు. కరీంనగర్‌లోని సాలెహ్ ఈద్గా, కొత్తపల్లి, చింతకుంట, సప్తగిరికాలనీ, అల్గునూర్ తదితర ఈద్గాల వద్ద ముస్లింలు రంజాన్ రోజున ప్రార్థనలు చేసేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించనున్నారు. టెంట్లు, కార్పెట్లు, సైడ్‌వాల్స్, ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కూలర్లు, మంచినీటి వసతి వంటి ఏర్పాట్లను చేసేందుకు చర్యలు చేపట్టారు. గతేడాది రంజాన్ పండుగ ఏర్పాట్లకు రూ.27.73 లక్షలను ఖర్చుచేశారు. రంజాన్ ఏర్పాట్లకు చేసిన ఖర్చులను క్షుణ్ణంగా పరిశీలించిన బల్దియా ఇంజనీరింగ్ అధికారులు అందులో అదనంగా చేసిన ఖర్చులను తగ్గించారు. ఉదాహరణకు గత ఏడాది 28 కూలర్లను ఒక్కో కూలర్‌కు 4వేల అద్దె చెల్లించి ఏర్పాటు చేయగా ఈ సారి 10 కూలర్లను కేవలం రూ.2,500 అద్దెతో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ విధంగా గతంలో చేసిన వాటి కంటే ఈసారి ఆచితూచీ ఏర్పాట్లు చేయడంతో దాదాపు రూ.10 లక్షల మేరకు ఆదా చేయగలిగారు. మరోవైపు ఏర్పాట్లలో లోపాలు లేకుండా చూడాలని పలువురు ముస్లిం మతపెద్దలు సూచిస్తున్నారు.

'రాజీవ్ యువ వికాసం'తో యువతకు బాసట

(5వ పేజీ తరువాయి)

సహాయం పొందదల్చుకున్నవారు 20వేల రూపాయలు, కేటగిరీ-2 కింద సహాయం పొందదల్చుకున్నవారు 30వేలు, కేటగిరీ-3 కింద సహాయం పొందదల్చిన వారు 40వేల రూపాయల వరకు తమవంతు పెట్టుబడిగా స్వయంగా కానీ బ్యాంకుల నుంచి కాని సమకూర్చుకోవలసి ఉంటుంది. తెలంగాణ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజిమెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (ఒబ్ఎంఎంఎస్) పోర్టర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు తాము నెలకొల్పదల్చుకున్న యూనిట్లకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత సంబంధిత కార్పొరేషన్లతోపాటు కలెక్టర్ పర్యవేక్షణలో మండల స్థాయిలోని అధికారుల కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేసి తుది జాబితాను ప్రకటిస్తుంది.

● సంక్షిప్తంగా

కరీంనగర్ కల్చరల్: భారత్ టాకీస్ రోడ్‌లోని వీరాంజనేయస్వామి, మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయాల హుండీలను బుధవారం లెక్కించనున్నట్లు ఈవో నాగారపు శ్రీనివాస్ పేర్కొన్నారు. 24వన ఉదయం 10 గంటలకు సాయినగర్ విజయ గణపతి సాయిబాబా దేవాలయం, బస్టాండ్ సాయి నిలయ హుండీలను, మధ్యాహ్నం 2 గంటలకు కోతిరాంపూర్ గిద్దె పెరుమాళ్ల ఆలయంలో, 27వ తేదీన ఉదయం 10 గంటలకు కోతిరాంపూర్ పోచమ్మ దేవాలయ హుండీలను లెక్కించ నున్నట్లు ఈవో ఎండపెల్లి మారుతి తెలిపారు.

కరీంనగర్ లీగల్: కరీంనగర్ బార్ అసోసియేషన్ డిజిటల్ లైబ్రెరీ ఆధునికీకరణకు కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రూ.15 లక్షల నిధులను మంజూరు చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీ రాజ్‌కుమార్, బేతి మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. న్యాయవాదుల డిజిటల్ లైబ్రెరీ ఆధునికీకరణలో భాగంగా కంప్యూటర్లు, ఇతర పరికరాలు కొనుగోలు నిమిత్తం బండి సంజయ్ నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కౌట్స్ శిబిరంలో జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్ గంగారపు మల్లేశం స్టాఫ్ మెంబర్‌గా విధులు నిర్వహించారు. మేడ్చల్ జిల్లాలోని ది భారత్ స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర శిక్షణ ప్రాంగణంలో ఈ నెల 10 నుంచి 16 వరకు ఏడు రోజులపాటు బేసిక్ అడ్వాన్స్‌డ్ కోర్స్ ఫర్ స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్ శిక్షణ శిబిరం నిర్వహించారు.

కరీంనగర్ టౌన్: కరీంనగర్ నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలిగా ఇటీవల నియామకమైన సీనియర్ న్యాయవాది రూపిరెడ్డి గీతారెడ్డి కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్‌ని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్లకు చెందిన కరెడ్ల వీరారెడ్డి తన భూమిని పహణీలో సర్దుబాటు చేయాలని సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సెయింట్ జార్జ్ నినోస్‌లో గ్రాడ్యుయేషన్ డే


ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పాఠశాల చైర్మన్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ) పాఠశాలలో రేకుర్తి, విద్యానగర్, తీగలగుట్టపల్లి నినోస్ బ్లాక్ బ్రాంచ్‌ల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిండర్ గార్డెన్-2 విద్యార్థులకు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఇన్‌చార్జిలు సంగీత, సంధ్య, స్వప్న పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆలయాల్లో సోమవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్‌రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవికన్యకాపరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి, పాతబజార్ గౌరీశంకర, చైతన్యపురి మహాశక్తి ఆలయాలతోపాటు పలు దేవాలయాల్లో అభిషేక, అర్చనలు, గణపతి హవనాల్లో భక్తులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో లక్ష్మీగణపతికి ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర ఆధ్వర్యంలో సోమవారం సంకటహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గణపతికి విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం విశేష హారతి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీభాష్యం విజయసారథి సంస్కృత పురస్కారం ప్రదానం


పురస్కారం అందుకుంటున్న హరేకృష్ణ శతపతి

కరీంనగర్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీభాష్యం విజయసారథి జాతీయ స్థాయి సంస్కృత పురస్కారాన్ని ఒరిస్సాకు చెందిన ఆచార్య హరేకృష్ణ శతపతి అందుకున్నారు.సోమవారం సంస్కృత అకాడమి, సర్వ వైదిక సంస్థానంట్రస్టు సంయుక్తంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత అకాడమిలో కార్యక్రమం నిర్వహించారు. మహా సహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ పురస్కారాన్ని అందజేశారు. అనంతరం విజయ సారథి రచించిన దేవనాగరి లిపిలో ఉన్న కావ్యాల సంకలనాన్ని ఆవిష్కరించారు. సంస్కృత అకాడమి డైరెక్టర్ ఆచార్య పెన్నా మధుసూదన్, డాక్టర్ సముద్రాల రంగరామానుజాచార్యులు, ఆచార్య నీలకంఠం, అనంతాచార్య, వరలక్ష్మి, డాక్టర్ సూర్యప్రకాశ్, శ్రీభాష్యం వరప్రసాద్, గిరిజా మనోహర్ బాబు, సంస్థానం ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పారమితలో ఘనంగా 'ఆరంభ్'

కరీంనగర్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో ఆరంభ్ పేరిట వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పారమిత పాఠశాలల అధినేత ప్రసాద్‌రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, టి.యస్వీ రమణ, వినోద్‌రావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వీయూఎం ప్రసాద్, హన్మంతరావు పాల్గొన్నారు.

మున్సిపల్ రెవెన్యూ అధికారిగా భూమానందం

కరీంనగర్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారిగా భూమానందం సోమవారం బాధ్యతలను స్వీకరించారు. కొంత కాలంగా ఆర్‌వో పోస్టు ఖాళీగా ఉండగా ఇన్‌చార్జి బాధ్యతలను ఇన్‌స్పెక్టర్ కలీముల్లా చేపట్టారు. హుస్నాబాద్‌లో పనిచేస్తున్న భూమానందంను డిప్యూటేషన్‌పై బదిలీ చేయడంతో ఆయన విధుల్లో చేరారు.

సామాజిక సేవకురాలికి ఉగాది పురస్కారం

సుభాష్‌నగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకురాలు చకిలం స్వప్న విశ్వావసు ఉగాది పురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమి వారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న కరీంనగర్‌కు చెందిన స్వప్నను ఎంపిక చేశారు. భారత్ ఆర్ట్స్ అకాడమి నిర్వాహకురాలు లలిత, దైవేజ్ఞశర్మ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ సుజాత అవార్డును అందజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

భగత్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ కరీంనగర్-2 డిపో మేనేజర్ వి.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12 వరకు 9959225921 నంబరులో సంప్రదించాలని సూచించారు. కరీంనగర్-2 డిపో పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, ధర్మారం, గంగాధర మండలాల ప్రయాణికులు సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

బీసీ బిల్లుపై హర్షం

గణేశ్‌నగర్,మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెశిపెద్ది శ్రీధర్ రాజు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ రాజు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సోమవారం శాసనసభలో బిల్లు ప్రవేశ పెట్టడం సంతోషకరం అన్నారు. ఈ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని ఆమోదించడానికి అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులు మద్దతు ఇవ్వాలని కోరారు. అఖిలపక్షాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్లాలన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

- మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో కోర్టు అనుమతులు ఇచ్చిన అక్రమ నిర్మాణాలన్నిటినీ వెంటనే కూల్చివేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ భవన నిర్మాణ అనుమతులు, కోర్టు సమస్యలు, ప్రకటన బోర్డుల బకాయిలు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టు సమస్యలు పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని సూచించారు. ప్రకటన బోర్డులకు సంబంధించిన పన్నుల బకాయిలన్నింటినీ వసూలు చేయాలన్నారు. చాలా కాలంగా చెల్లించకుండా ఉన్న వారికి నోటీసులు ఇచ్చి మూడు రోజుల్లో వసూలు చేయాలని, గడువు అనంతరం ఆయా బోర్డులన్నిటినీ తొలగించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని, బల్క్ ఎస్ఎంఎస్‌లతోపాటు ఫోన్ చేసి ఫీజులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ బషీర్, వేణు, టీపీఎస్‌లు రాజ్‌కుమార్, సంధ్య, లైజన్ ఆఫీసర్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల జీవితాల్లో వెలుగులు


డప్పులతో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష శిబిరంలో సోమవారం డప్పులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మాదిగల 70 ఏళ్ల కల అన్నారు. వర్గీకరణ లేకపోవడంతోనే మాదిగలు విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా మంద కృష్ణమాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించారని, ఈ ఉద్యమాన్ని దెబ్బతీయడానికి పాలకులు ఎన్నో కుట్రలు చేశారని, వాటిని ఛేదించి 30 ఏళ్లుగా ఉద్యమాన్ని కాపాడారని అన్నారు. ఇప్పటికీ కొంతమంది జాతీ ద్రోహులు పాలకులు ఇచ్చేవాటికి ఆశపడి మంద కృష్ణమాదిగపై విమర్శలు చేస్తున్నారన్నారు. వారికి మాదిగలే సమాధానం చెబుతారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, అన్ని ఉద్యోగాల నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించి తక్షణమే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలి

భగత్‌నగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పెరిగిన జనాభా ప్రాతిపదికన దళితులకు బడ్జెట్ కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జాతీయ కౌన్సిల్ సభ్యుడు బోయిని అశోక్ అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, ఆర్థిక ఎదుగుదలకు కార్యాచరణ రూపొందించాలన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలైన దళితులకు జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

చొప్పదండి/గంగాధర/రామడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సబ్మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ స్కీం కింద మహిళా రైతులకు 40శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారుల వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్టుఫొటో, వ్యవసాయవిస్తరణ అధికారి ధ్రువీకరించిన దరఖాస్తును ఈనెల19లోగాకార్యాలయంలోఅందజేయాలని కోరారు.

ఎమ్మెల్యే అవినీతి చేశాడనడం అబద్ధం

తిమ్మాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సీఎంఆర్‌ఎఫ్‌లో 6కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధం అని కాంగ్రెస్‌పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి మాట్లాడారు. రసమయి ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఇల్లంతకుంటలో ఒకరి పేరుతో వచ్చిన చెక్కును అదే పేరుగల వ్యక్తి ఖాతాలో జమ అయిన విషయం వాస్తవమేనని, ఈ ఒక్క సంఘటనను దృష్టిలో పెట్టుకొని చెక్కుల పంపిణీలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపించడం సరికాదన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

రామడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డిని కాంగ్రెస్‌ప్రభుత్వం అకారణంగా సస్పెండ్ చేసినందుకు, అలాగే కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ రామడుగు మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసనకార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి, కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎంపీపీ మార్కొండ కృష్ణారెడ్డి, తౌటు మురళి, నాయకులు పాల్గొన్నారు

తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆశావర్కర్ల ధర్నా

హుజూరాబాద్/చిగురుమామిడి/శంకరపట్నం, మార్చి17(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, చిగురుమామిడి, శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాలకు రూ.18వేల వేతనం ఇవ్వాలని తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లాజాయింట్ సెక్రెటరీ శంకర్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి మారెల్ల శ్రీలత మాట్లాడుతూ ఆశాలకు ఉద్యోగ భద్రతతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఏఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇల్లందకుంట డిప్యూటీ తహసీల్దార్‌గా మన్మీత్‌సింగ్

ఇల్లందకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట డిప్యూటీ తహసీల్దార్‌గా మన్మీత్‌సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీటీగా పనిచేసిన పార్థసారథి శంకరపట్నం మండలంకు బదిలీ కాగా ఆయన స్థానంలో మన్మీత్‌సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులుజారీ చేసింది.

శంకరపట్నం: మండల డిప్యూటీతహసీల్దార్‌గా పార్థసారథి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇల్లందకుంట నుంచి బదిలీలో భాగంగా శంకరపట్నం డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

రూ.7140 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7140 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 13మంది రైతులు 184క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ట ధర రూ.7140, కనిష్ట ధర రూ.6800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం కొనుగోళ్లను దగ్గరుండి పర్య వేక్షించారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం: కలెక్టర్


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రభుత్వపథకాలు, కార్యక్రమాలు అమలు చేయడంలో అన్ని కేటగిరీలకు చెందిన ఉద్యోగుల సేవలు అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎల్ఎండీ కాలనీలో సూపరింటెండెంట్ ఇంజనీర్, నీటి పారుల సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ప్రభుత్వ కార్యక్రమాలైనా విజయవంతంగా అమలు చేయడంలో జిల్లా ఉద్యోగులు ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్, పాల్గొన్నారు.

ఎండిన పంటలకు వెంటనే పరిహారం ఇవ్వాలి

చిగురుమామిడి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎండిపోయిన మొక్కజొన్న, వరిపంటలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి రైతులనుఆదుకోవాలని హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని నవాబుపేట తదితర గ్రామాల్లో ఎండిన పంటలను బీఎస్పీ బృందం పరిశీలించింది. గౌరవెల్లిప్రాజెక్టు సకాలంలో పూర్తి చేయకపోవడంతోనే మెట్టరైతులకుశాపంగా మారిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌ప్రభుత్వం వెంటనే ప్రాజెక్టు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్,కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


కేసీఆర్,కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంగాధర, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గంగాధరలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీసీఎం కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల16న కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్‌లు మడ్లపల్లి గంగాధర్, దామోదర్, నజీర్ హుస్సేన్, మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

తిమ్మాపూర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతూ బిల్లును శాసనసభలో ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్‌కార్యాలయంలో నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నంప్రభాకర్, ఎమ్మెల్యే సత్యనారాయణ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

వీణవంక: మండలంలోని వల్బాపూర్ గ్రామంలోని అంజనేయస్వామి అలయంలో సోమవారం సీతరాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.అనంతరం మహ అన్నదానం చేపట్టారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌యార్డులో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సోమవారం చీరెలు పంపిణీ చేశారు.

హుజూరాబాద్‌రూరల్: మండల వ్యాప్తంగా ప్రతిగ్రామంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిగేలా వీహెచ్‌పీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు కంకణాల రమేష్‌రెడ్డి అన్నారు.గ్రామాల్లో ప్రతి ఇంటిపై కాషాయ జెండా ఎగిరేలా చూడాలన్నారు.

హుజూరాబాద్ రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండలంలోని ఆయాగ్రామాల్లో వందరోజులు పూర్తిచేసిన ఉపాధిహామీ కూలీలకు వర్మీకంపోస్టు తయారీవిధానంపై ట్రైనింగ్ కోఆర్డినేటర్ అనూష, నాగశ్రీ అవగాహన కల్పించారు.

హుజూరాబాద్: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. సోమవారం 22వార్డులో స్వచ్ఛసర్వేక్షన్‌లో భాగంగా తడి,పొడిచెత్త, పరిసరాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలో రెండోవిడత దళితబంధు నిధులు రావడానికి కృషిచేసిన కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌ను దళితబంధు లబ్ధిదారులు సోమవారం కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు.

చిగురుమామిడి: దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అంటేనే దళితలకు వ్యతిరేకం అని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రుల దిష్టి బొమ్మలను దహనం చెయ్యడం అప్రజాస్వామికం అని అన్నారు.

శ్రీచైతన్యలో ఘనంగా ప్రారంభమైన మోగా స్పోర్ట్స్ మీట్



మాట్లాడుతున్న చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి

తిమ్మాపూర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో మెగాస్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ స్పోర్ట్స్‌మీట్ ఈనెల 22వరకు వారం రోజులపాటు జరగనుంది. విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శరీరసౌష్టవాన్ని పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ ప్రసాదరాజు, వెంకటేశ్వర్లు, రామనర్సింహారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

చొప్పదండి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వదిలిపెట్టారు. అనంతరం వారు కేటీఆర్, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, మినుపాల తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

హుజూరాబాద్/సైదాపూర్/రామడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణపై ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హుజూరాబాద్‌లో వారు చేస్తున్న నిరసన దీక్ష 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రామచంద్రం, తునికి వసంత్, సొల్లు బాబు, సమ్మయ్య, శ్రీధర్, రవీ, సైదాపూర్‌లో సంగాల తిరుపతి, ములుగు అశోక్, మట్టల రవీందర్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

జమ్మికుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట నుంచి హైదరాబాద్‌కు బస్సు పునరుద్ధరించాలని సీపీఎం మండల సహాయకార్యదర్శి వడ్లూరికిషోర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రెండు సంవత్సరాల నుంచి బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుశీల

హుజూరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆలేటి సుశీలను బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. కొన్నేళ్లుగా సుశీల కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకు ఈ పదవిని అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుశీల కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళాఅధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నా రెడ్డితోపాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు

మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించాలి

తిమ్మాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను ఆశాఖ నుంచి తొలగించైనా మండలకేంద్రంలో ఆర్టీసీబస్టాండ్ ఎదుటగల మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు బి ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో విగ్రహాల ముసుగులు తొలగించాలని డిమాండ్ చేస్తూ జేఏసి ఆధ్వర్యంలో 8రోజులుగా చేస్తున్న రిలేనిరాహారదీక్షల్లో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు.